


# కరపత్రం

SINCE 2014

గురువారం సెప్టెంబర్ 4 2025 సంపుటి :0 సంచిక :319 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

## నాన్నా.. మీ చుట్టూ ఏం జరుగుతోందో చూసుకోండి:

### ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు



2లో

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి

## ఖైరతాబాద్‌లో భక్తుల రద్దీ.. మహా గణపతి దర్శనానికి 3 గంటలు



హైదరాబాద్: ఖైరతాబాద్‌లో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. 8వ రోజు విశ్వరూప మహాగణపతి దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి బడా గణేష్‌ను దర్శించుకోవడానికి భక్తులు తరలివస్తున్నారు. దీంతో లక్డీకాపూల్, ట్యాంక్‌బండ్, సచివాలయం మార్గాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. వారం రోజుల్లో దాదాపు 12 లక్షల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

# ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదు

- కాంగ్రెస్ అంటేనే పేదలపక్షం
- ఇందిరమ్మ ఇళ్ల బాధ్యతను నెరవేరుస్తున్న పొంగులేటి
- పదేళ్లుగా లేని రేషన్ కార్డులు ఇచ్చాం
- పేదలందరికి సన్నబియ్యం సరఫరా
- బిఆర్ఎస్ సచ్చిన పాము..దానిని మళ్లీమళ్లీ చంపడమెందుకు?
- లక్షకోట్లను పంచుకోవడంలో కెసిఆర్ కుటుంబంలో కలహాలు
- కత్తులతో ఒకరినొకరు పొడుచుకుంటున్నారు
- వారి పంచాయితీలో తలదూర్చే సమయంమాకెక్కడిది





హనుమాన్ గుడి లేని ఊరు ఉండొచ్చు గానీ.. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలందరికీ ఇళ్లు వచ్చేలా చేయాలన్నా.. ధరణి భూతం నుంచి రైతులకు విముక్తి కల్పించాలన్నా సమర్థుడైన మంత్రి కావాలని భావించా. అందుకే, పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గృహనిర్మాణ, రెవెన్యూ శాఖలు అప్పగించా. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి విజయవంతం చేశారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఏర్పాటు చేసిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం దామరచర్లలో నిర్వహించిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు.

ఇల్లులేని ప్రతి పేదవాడికి ఇల్లు ఇస్తామని గతంలో వైఎస్ఆర్ ప్రకటించారు. రాష్ట్రంలో 2004 నుంచి 2014 మధ్య 22 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించి ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్లలోకి పేదలు ప్రవేశించినప్పుడు వచ్చే ఆనందం వెలకట్టలేనిది. పేదల కష్టాలు మాకు తెలుసు కాబట్టే .. పేదరికాన్ని రూపుమాపాలని నిర్ణయించుకున్నాం. రాష్ట్ర ప్రజలకు పదేళ్లపాటు–.. కొత్త రేషన్ కార్డులు అంటే ఏంటో తెలియదు. మా ప్రభుత్వం రాగానే లక్షలాది రేషన్ కార్డులు, ఇళ్లు ఇచ్చాం. మేము ఏ బియ్యం తింటున్నామో.. పేదలకూ అవే సన్నబియ్యం ఇస్తున్నాంఅని రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ విషనాగు. ఈ పాములో కాలకూట విషం ఉంది.

పేజి 2లో ▶

## హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం.

### . హాజరు కానున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



హైదరాబాద్: గణేశ్ నిమజ్జనంలో పాల్గొనేందుకు ఈ నెల 6న కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా హైదరాబాద్‌కు రానున్నారు. మధ్యాహ్నం 1:10కి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఐటీసీ కాకతీయకు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు బీజేపీ ముఖ్య నేతలతో భేటీకానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్తంపై ఆరా తీయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

మధ్యాహ్నం 3 నుంచి 3:30 వరకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి 46 ఏళ్ల ప్రయాణంపై ఐటీసీ కాకతీయలో ఏర్పాటు చేసే ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర హోంమంత్రి ప్రారంభించి.. కమిటీ సభ్యులతో గ్రూప్ ఫోటో దిగనున్నారు. 3:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్ఎస్‌బీ 28వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌కి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. ఐటీసీ కాకతీయ నుంచి సాయంత్రం 4 గంటలకు మెజాంజాహీ మార్కెట్ వినాయక చౌక్‌కు చేరుకుని గణనాథులకు స్వాగతం పలకడంతో పాటు గణేష్ శోభాయాత్రను ఉద్దేశించి ప్రసంగిస్తారని భాజపా వర్గాలు తెలిపాయి.

## కవితకు బీఆర్ఎస్ కౌంటర్..




మాజీ ఎమ్మెల్సీ కవితపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పరోక్షంగా ఫైర్ అయ్యారు.

హైదరాబాద్: పరోక్షంగా మాజీ ఎమ్మెల్సీ కవితను టార్గెట్ చేస్తూ.. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కొందరు ఎవరికోసమో.. హరీష్ రావును టార్గెట్ చేస్తూ.. మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రక్షణగా ఉండాల్సిన సమయంలో ప్రత్యర్థులకు ఊతం ఇచ్చేలా మాట్లాడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా సమస్య ఉంటే తేల్చుకోవడానికి పద్ధతులు వేరే ఉన్నాయని సూచించారు. శత్రువులకు బలం చేకూర్చేలా మాట్లాడటంలో ఎజెండా ఏంటో ప్రజలు గమనిస్తున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు.

పేజి 2లో ▶

## భాజపా కలిసి భారత రాష్ట్ర సమితిపై కుట్ర చేస్తున్నాయి



ఎర్రవల్లి: కాంగ్రెస్ 21 నెలల పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎర్రవల్లిలో మీడియాతో ఆయన మాట్లాడారు. "ప్రతి రైతూ అప్పటి రోజులే బాగుండేవేని అంటున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా హుస్సేన్‌సాగర్ వంటివి రోజుకు రెండు నింపొచ్చు. ఆ ప్రయత్నమే కేసీఆర్ చేశారు. అంతటి గొప్ప కాళేశ్వరం కట్టిన కేసీఆర్‌పై సీబీఐ కేసులు పెడుతున్నారు. సీబీఐ అనేది భాజపా జేబు సంస్థ అని రాహుల్‌గాంధీ రోజూ అంటున్నారు. కాంగ్రెస్, భాజపా కలిసి భారత రాష్ట్ర సమితిపై కుట్ర చేస్తున్నాయి"అని కేటీఆర్ విమర్శించారు.


## చిన్నమొత్తమే రూ.కోట్ల నిధిగా మారుతుంది

**పీఎఫ్ఆర్డీఏ ఈడీ మమత రోహిత్**

హైదరాబాద్: దేశంలో 2047 నాటికి కార్మిక బలగం, అసంఘటిత రంగంలోని కార్మికులందరినీ జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) పరిధిలోకి తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని పీఎఫ్ఆర్డీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మమత రోహిత్ తెలిపారు. ప్రస్తుతం అటల్ పింఛను యోజన, ఎన్‌పీఎస్ కింద 8 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారని,

పేజి 2లో ▶





## కాళేశ్వరం నుంచి దృష్టి మరల్చేందుకే కవిత అంశం: బండి సంజయ్

హైదరాబాద్: కాళేశ్వరం అవినీతిపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్టులు వచ్చాక కూడా కాలయాపన చేశారని, ఇప్పుడు సీబీఐకి అప్పగిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. మరి ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేస్తే ఏంటని ప్రశ్నించారు. కాళేశ్వరం నుంచి దృష్టి మరల్చేందుకే కవిత అంశం ముందుకు వచ్చిందన్నారు. కాళేశ్వరం, గొర్రెలు, బర్రెల కుంభకోణంపై చర్చ జరగాలని అన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం సెప్టెంబర్ 4 2025

# సంపాదకీయం

## బీఆర్ఎస్ భవితవ్యం ఏమిటి

భారతదేశంలో ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తు ఉన్నదా? తెలంగాణలో ఒకప్పుడు ఉజ్వలమైన పాత్రను పోషించిన భారత రాష్ట్ర సమితి దుస్థితి చూస్తుంటే ఈ అనుమానం రాకమానదు. బీఆర్ఎస్ ఎదుర్కొంటున్న పరిస్థితి అన్ని ప్రాంతీయ పార్టీలకూ వస్తుందని చెప్పలేము కాని బీఆర్ఎస్ దుస్థితి నుంచి మాత్రం ప్రాంతీయ పార్టీలు, వాటి నేతలు ఎలా వ్యవహరించకూడదో తెలుసుకునే అవకాశం ఉన్నది, తెలుసుకోవాలి కూడా. గత లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి కేవలం 240 సీట్లు మాత్రమే లభించాయి. ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడింది. ఇండియా కూటమిలో కాంగ్రెస్ సంఖ్యాబలం కంటే రెట్టింపుకు పైగా సంఖ్యాబలం ప్రాంతీయ పార్టీలదే. అంత మాత్రాన ప్రాంతీయ పార్టీల పరిస్థితి మెరుగ్గా ఉన్నదని చెప్పడానికి వీల్లేదు. ఇందుకు 2024 జూన్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికలే తార్కాణం. కాని బీజేపీకి మద్దతునిచ్చిన ప్రాంతీయ పార్టీల్లో ఒక్క తెలుగుదేశం, జేడీ(యు) ప్రధాన పార్టీలు కాగా మిగతావన్నీ చిన్నా చితక పార్టీలు. ఎన్డీఏలో ఉన్నామని చెప్పుకుంటున్న దాదాపు 20 పార్టీలకు ఒక్క సీటూ లేదు. ఇండియా కూటమిలో కూడా సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, తృణమూల్ మాత్రమే ప్రధాన పార్టీలు. దాదాపు 30కి పైగా పార్టీలు రెండు కూటముల్లోనూ అయిదు స్థానాలలోపే సాధించగా, వాటిలో మెజారిటీ పార్టీలకు కేవలం ఒక్కొక్క సీటే లభించింది. బీజేడీ, బీఆర్ఎస్, అన్నాడీఎంకే వంటి ప్రధాన పార్టీలు అదృశ్యం కాగా, శివసేన, లోక్ జనశక్తి, ఎన్సీపీ, జేఎంఎం వంటి పార్టీలు నిలదొక్కుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. నిజానికి భారత రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీల్లో కెల్లా జూనియర్ పార్టీ. డీఎంకే 1949లోనూ, ఆ పార్టీ నుంచి చీలిన అన్నాడీఎంకే 1972లోనూ జన్మించాయి. శివసేన 1966 నుంచీ ఉనికిలో ఉన్నది. జార?ండ్ ముక్తి మోర్చా 1972లో ఆవిర్భవించింది. తెలుగుదేశం 1982లో ఏర్పడితే, సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ 1990వ దశకంలో జన్మించాయి. ఈ పార్టీలన్నీ ఇవాళ్టికీ అస్తిత్వంలో ఉండగా అవి ఏర్పడిన ఎంతో కాలానికి జన్మించిన బీఆర్ఎస్ మాత్రం ఎందుకు అంతర్గత సంక్షోభంలో చిక్కుకున్నది? ఈ విషయమై ఆ పార్టీ ఆత్మపరీక్ష చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. చాలా ప్రాంతీయ పార్టీలకు ఒక సిద్ధాంతం, చరిత్ర, లక్ష్యాలు ఉన్నాయి. అవి రాజ్యాంగంలో పీఠిక లాంటివి. ఇటీవల మరణించిన జేఎంఎం అధినేత శిబూసోరెన్ కేవలం రాజకీయ నాయకుడు కాదు. భూస్వాములు, వడ్డీ వ్యాపారులు ఉపాధ్యాయుడైన తన తండ్రిని 1957లో హత్య చేస్తే వారికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పోరాడుతూ ఎదిగిన ప్రజా నాయకుడు. ఆదివాసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం, వారిని కట్టుబానిసత్వం నుంచి విముక్తి చేయడం కోసం పోరాడినవాడు. డీఎంకేకు 1916 నుంచే ద్రవిడ ఉద్యమం నిర్వహించిన చరిత్ర ఉన్నది. పెరియార్, అన్నాదురైలు నిర్మించిన వారసత్వం ఉన్నది. ఇవాళ స్టాలిన్ ఆ వారసత్వాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. సోషలిస్టు నాయకుడు రామ్‌మనోహర్ లోహియా సామాజిక న్యాయం కోసం ప్రారంభించిన పోరాట క్రమంలో సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్ ఉద్భవించాయి. ములాయం తర్వాత అఖిలేశ్, లాలూ తర్వాత తేజస్వి తమ తండ్రుల దారిలో రాష్ట్రాల్లో బీజేపీని ఢీకొంటున్నారు. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా 85 ఏళ్ల వయస్సులో శరద్ పవార్ మరాఠా ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పోరాడుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి కూడా బెంగాలీల ఆత్మగౌరవానికి తానే ప్రతీకగా భావిస్తూ బీజేపీని శాయశక్తులా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. తెలుగు వారి ఆత్మగౌరవం, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏర్పడిన తెలుగుదేశం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, రాష్ట్ర విభజన జరిగినా అస్త్ర సన్యాసం చేయకుండా నిలదొక్కుకుని ఇవాళ కేంద్రంలో ఎన్డీఏ సర్కార్‌కు కీలక మద్దతునిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా మూడు దశాబ్దాల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు ఇంకా అదే ఉత్సాహంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో ఏ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నాయన్నది ప్రధానం కాదు. చంద్రబాబు లాగా కరుణానిధి, మమతా బెనర్జీ, జయలలిత కూడా బీజేపీతోనూ కాంగ్రెస్‌తోనూ సంబంధాలు ఏర్పర్చుకున్నవారే. అయినా వారు తమ అస్తిత్వాన్ని పణంగా పెట్టినవారు కాదు. ఏది జరిగినా ఓటమిని అంత సులభంగా అంగీకరించేవారు కారు. మరి కేసీఆర్‌కు ఏమైంది? ఆయన పార్టీ ఎందుకు లుకలుకలకు గురవుతోంది? కారణం ఏమంటే తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడ్డ లక్ష్యాలకు, ఆశయాలకూ కేసీఆర్ దూరం కావడమే. నేల విడిచి సాము చేయడమే. చాలా మంది ప్రాంతీయ నాయకులకున్న స్థిరత్వం, లక్ష్యశుద్ధి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కేసీఆర్‌కు లేవు. తెలంగాణ ప్రజల్లో, ముఖ్యంగా సామాజికంగా బలహీనవర్గాల్లో ఆకాంక్షలు పెరిగిపోయిన క్రమంలో జయశంకర్, కోదండరాం వంటి అనేక మంది నేతలు నిర్మించిన ఉద్యమం ఆయన రాజకీయంగా బలపడేందుకు తోడ్పడింది. కేసీఆర్ పార్టీ ప్రారంభించిన ఏడేళ్ల వరకూ కేటీఆర్, కవిత దరిదాపుల్లో ఉండేవారు కాదు. 'మా రాము అమెరికాలో ఉంటాడు. నెలకు 300 డాలర్లు పంపుతాడు. తెలంగాణ ఏర్పడకపోయినా నా మనుగడకేమీ ఢోకా లేదు' అని ఆయన తుగ్లక్ రోడ్‌లో కేటీఆర్‌ను పరిచయం చేసిన రోజులున్నాయి. చాలా పార్టీల్లో ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల్లో వారసులు ఉండడం సహజం. కాని ఆ పార్టీలేవీ వారసుల మూలంగా అంతర్గత సంక్షోభంలో చిక్కుకోలేదు. ములాయం, లాలూ, కరుణానిధి, శిబూ సోరెన్‌ల వారసులే ఆ తర్వాత ముఖ్యమంత్రులయ్యారు.

# కవితకు బీఆర్ఎస్ కౌంటర్..

మొదటిపేజీ తరువాయి
మాజీ మంత్రి హరీష్ రావు మొదటి నుంచి పార్టీలో ఉన్నారని నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు. బ్రహ్మం గారికి సిద్ధప్ప లాగా కేసీఆర్‌కు హరీష్ రావు అని చెప్పుకొచ్చారు. జలదృశ్యంలో పార్టీ గద్దె కడిదే.. జెండా కట్టింది హరీశ్ రావు అని తెలిపారు. ఎంపీ ఈటల రాజేందర్ ఎపిసోడ్‌లో హరీష్ పాత్ర లేదని స్పష్టం చేశారు. దాన్ని హరీష్‌కు ఆపాదించడం ఏంటి..? అని ప్రశ్నించారు. ఈటెల వెళ్లకుండా చివరి వరకు ప్రయత్నం చేసిన వ్యక్తి హరీష్ రావు అని చెప్పుకొచ్చారు.
సీఎం రేవంత్ రెడ్డి కాళ్లను హరీష్‌రావు మొక్కారు అనడం అబద్ధమని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాల కోసం ఇంత నీచమైన ఆరోపణలు చేస్తారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత ఆరోపణలను ప్రజలు నమ్మరని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు సంతోష్‌రావు వ్యక్తిగత సహాయకుడు మాత్రమే అని వివరించారు. ఎవరి లాభం కోసం హరీష్‌రావును టార్గెట్ చేస్తున్నారు..? అని నిలదీశారు. కవితకు కష్టం వచ్చినప్పుడు హరీష్‌రావు సహా అందరం బాధపడ్డామని గుర్తు చేశారు. ఎవరో చెబితే తప్పుదారి పట్టేంత బలహీనుడుకాదు కేసీఆర్ కాదని నొక్కి చెప్పారు. కేసీఆర్‌ను ఎవరూ తప్పుదారి పట్టించలేరని ఉద్ఘాటించారు. కేసీఆర్ అలాంటి నాయకుడైతే తెలంగాణ సాధించేవారా..? అని నిలదీశారు. వ్యక్తిగత లబ్ధి కోసం ఆరోపణలు సరికాదని నిరంజన్ రెడ్డి హితవు పలికారు.

# ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదు





మొదటిపేజీ తరువాయి
అయితే, ప్రజలు దాని కోరలు ఎప్పుడో పీకేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డితో కుమ్మక్కయ్యారంటూ కవిత చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు. లక్ష కోట్లు- దోచుకున్న వ్యక్తి ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. పంపకాల్లో తేడాలు వచ్చి ఒకరినొకరు కొట్టుకుంటున్నారు. అక్క, అన్న, చెల్లి, బావ ఒకరినొకరు కత్తులతో పొడుచుకుంటున్నారు. దోపిడీ సొమ్ము వాళ్లింట్లో చిచ్చు పెట్టింది. సంపాదించుకున్న టీవీలు, పేపర్ల కోసం కొట్టుకుంటున్నారు. వాళ్లు వాళ్లు కొట్టు-కుంటూ మాపై నిందలు వేస్తున్నారు. మీ పంచాయితీల్లోకి మమ్మల్ని లాగొద్దు. చచ్చిన పామును మళ్లీ చంపాల్సిన అవసరం మాకేముంది. బీఆర్ఎస్ ను ప్రజలే బొందపెట్టారని సీఎం రేవంత్ మండిపడ్డారు. దామరచర్ల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సొంతిల్లు అనేది ప్రతి పేదవాడి జీవితస్వప్నం అని.. గత పదేళ్లు పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదని అన్నారు. ఏటా 2 లక్షల ఇళ్లు కట్టినా పదేళ్లలో 20 లక్షల మందికి వచ్చేవని.. కానీ డబుల్ బెడ్‌రూమ్ ఇళు అంటూ గత ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనబడుతోంది. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.
బీఆర్ఎస్ తెచ్చిన ధరణికి పాతరేసి భూభారతి తీసుకొచ్చి రైతుల సమస్యలు పరిష్కరించామని వెల్లడించారు. మునుపెన్నడూ లేని విధంగా రేషన్ షాపుల్లో సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. మన పిల్లలు బర్రెలు, గొర్రెలు కాచుకోవాలని కేసీఆర్ పార్టీ వాళ్లు అంటారని.. వాళ్ల పిల్లలు మాత్రం చదువుకుని రాజ్యం ఏలి దోచుకుంటారట అంటూ తీవ్రంగా విమర్శించారు. టీవీలు, పేపర్లు సంపాదించుకున్నారు.. వాటి కోసం కొట్టు-కుంటు-న్నారని ఆరోపించారు. దోపిడీ సొమ్మే ఇవాళ వాళ్ల మధ్య చిచ్చు పెట్టిందని, వాటాల కోసం వాళ్లు వాళ్లు కొట్టుకుంటూ మాపై నిందలు వేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలే బొంద పెట్టారని.. సచ్చిన పామును చంపాల్సిన అవసరం మాకేముందని ఎద్దేవా చేశారు. మీ కుటుంబ పంచాయితీలోకి మమ్మల్ని లాగొద్దని హెచ్చరించారు. బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల పైలాన్???ను ఆవిష్కరించారు సీఎం రేవంత్. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్దిదారులతో కలిసి గృహ ప్రవేశం చేశారు. తెలంగాణ తొలి దశ ఉద్యమం ఖమ్మం జిల్లా పాల్వంచలోనే మొదలైందని, ఖమ్మం జిల్లా ప్రజల తెలంగాణకు దిశ దిశను చూపించారన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడాలని కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో కలిశారు. ఇది ఎన్నికల స్టంట్ కాదు. ప్రజలు ఆలోచన చేయాలి. రోటీ, కప్డా, మకాన్ అనే నినాదాన్ని నాడు ఇందిరమ్మ కొనసాగిస్తే, అదే నినాదాన్ని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గల్లీ గల్లీ.. ఊరు ఊరు తిరిగి ప్రతి పేద వాడికి 25 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు ఉన్న ఊర్లోనే ఓట్లు- అడుగుతామని 2023 ఎన్నికల్లో కేసీఆర్‌కు సవాలు విసిరా. పేదలు ఇందిరమ్మ ఇళ్లలోకి గృహ ప్రవేశం చేసినప్పుడు కలిగిన ఆనందం నేను జూబ్లీహిల్స్‌లో గృహప్రవేశం చేసిన రోజు కూడా రాలేదన్నారు. 4500 ఇండ్లు కేవలం అశ్వరావు పేటకు ఇచ్చా. కొందరికి పేదరికం అంటే ఎక్స్ కర్షన్.. మేము పేద వర్గంలో పుట్టి పెరిగి, వారితో అన్ని సమానంగా పంచుకున్నాం. పేదలుగా బతకడం మా జీవన విధానం. పేదరికం తెలిసి, కుటుంబ సభ్యులుగా భావించే పార్టీ కాంగ్రెస్ పార్టీ. ఇందిరమ్మను పేద ప్రజల గుండెల్లో అమ్మలా గుడి కట్టుకున్నారు. పేదలు కళ్లు కాయలు కాసేలా వేచి చూసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమం అందలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సమయస్ఫూర్తి కలిగిన జిల్లా. అందుకే ఈ జిల్లా నుంచి ముగ్గురు మంత్రులను చేశాం. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలి. పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఉండి ఉంటే పేద వర్గాల కష్టాలు తీరిపోయేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కర్యక్రమంలో మంత్రి పొంగులేటి, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# చిన్నమొత్తమే రూ.కోట్ల నిధిగా మారుతుంది

మొదటిపేజీ తరువాయి
రూ.15.56లక్షల కోట్ల ఆస్తులున్నాయని పేర్కొన్నారు. దేశంలో 46 కోట్ల మంది కార్మిక బలగం ఉంటే.. 17 కోట్ల మందికి మాత్రమే పింఛను ప్రయోజనాలు ఉన్నాయని వెల్లడించారు. వ్యవసాయ కార్మికులు, సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలు, మహిళలను, పిల్లలను ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చి భవిష్యత్తుకు మార్గం వేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ రైతులు, కార్మికులకు మరింత అవగాహన కల్పించి, ఈ పథకంలో చేర్చేందుకు ప్రైవేటు సంస్థలు, సొసైటీలు, సంఘాల భాగస్వామ్యం తీసుకోనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయదారులు, మహిళల కోసం మరిన్ని పథకాలు తీసుకువచ్చే ఆలోచనలో ఉన్నామన్నారు. పీఎఫ్ఆర్‌డీఏ కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌పీఎస్ జరూరీహై (విత్తన పొదుపు పింఛను పంట), ఎన్‌పీఎస్ వాత్సల్య (పిల్లల భవిష్యత్తు కోసం) పథకాలపై 'ఈనాడు'తో మమత రోహిత్ మాట్లాడారు.
ఎన్‌పీఎస్‌లో ఇప్పటికే పాక్షిక ఉపసంహరణలకు అవకాశముంది. లాకిన్ పీరియడ్ తరువాత అత్యవసరాలైన వైద్యసేవలు, విద్య, పిల్లల వివాహాలు, గృహాలు కొనుగోలు చేసేందుకు మూడుసార్లు కలిపి 25శాతం వరకు జమను ఉపసంహరించుకోవచ్చు. అవసరాల ఆధారంగా నిబంధనలు మార్చే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు ఉపసంహరణ పరిమితి పెంచాలన్న డిమాండ్లు లేవు.
పదవీ విరమణ వయసు 60 ఏళ్లు అనుకుంటాం. కానీ చాలా మంది 60 ఏళ్లు దాటిన తరువాత కూడా పనిచేస్తున్నారు. అందుకే ఈ పథకంలో చేరే వయసును 70 ఏళ్ల వరకు పెంచాం. గతంలో 60 ఏళ్లు నిండగానే ఎన్‌పీఎస్ కార్పస్ నుంచి 60 శాతం ఏకమొత్తంగా ఉపసంహరించుకోవాలని, 40శాతం కార్పస్‌ను యాన్యుటీలో పెట్టాలన్న నిబంధన ఉండేది. ఇప్పుడు 75 ఏళ్ల వరకు ఏకమొత్తం, యాన్యుటీ అవకాశాన్ని పొడిగించుకునే అవకాశమిచ్చాం. తద్వారా 75 ఏళ్ల తరువాత ఉపసంహరించుకునే అవకాశం ఉంటోంది. అంటే అప్పటి వరకు పీఎఫ్ఆర్‌డీఏ వద్ద కార్పస్ నిల్వలు ఉండటంతో దానిపై వచ్చే రిటర్న్ లబ్ధికూడా పెరుగుతోంది. ఆ తరువాత నెలవారీ పింఛనుకు అవసరమైన ప్రణాళిక చేయవచ్చు. సిస్టమెటిక్ విత్‌డ్రాయల్ ఆప్షన్ (ఎస్‌డబ్ల్యూపీ) కూడా పొందుపరిచాం.
ఎన్‌పీఎస్ నిధి నిర్వహణలో నూరుశాతం పారదర్శకత పాటిస్తున్నాం. 16 రెగ్యులేషన్స్ ఉన్నాయి. దగ్గర నుంచి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. అసంఘటిత రంగంలోని కార్మికులను ఎన్‌పీఎస్ పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరముంది. ఇప్పటికే పీఎఫ్ఆర్‌డీఏ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఆ రంగాన్ని చేరువ చేసుకోవాల్సిన అవసరముంది.
కొత్తగా ప్రకటించిన ఎన్‌పీఎస్ వాత్సల్య పథకంలో పుట్టిన వెంటనే ఖాతా తెరిచే అవకాశముంది. పీఎఫ్ లెక్కింపు క్యాలిక్యులేటర్, రిటర్నులు పరిశీలిస్తే పుట్టినప్పటి నుంచి ఖాతాలో వేసే చిన్నపాటి మొత్తం.. 75 ఏళ్ల నాటికి కోట్లాది రూపాయల కార్పస్ అవుతుంది. యువత పింఛను పథకాలను సరిగా అర్థం చేసుకోవడం లేదు. పింఛను అనేది పెద్ద ప్రణాళిక అని, దీర్ఘకాలం నిధి లాక్ అవుతుందని భావిస్తున్నారు. సత్వర అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. వారందరికీ పింఛను ఉపయోగంపై అవగాహన కల్పిస్తున్నాం. యువతను పెద్దఎత్తున ఎన్‌పీఎస్‌లో చేర్చేందుకు ప్రణాళికలు చేస్తున్నాం అని తెలిపారు.

# నాన్నా.. మీ చుట్టూ ఏం జరుగుతోందో చూసుకోండి:

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి లోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో కవిత మీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా కవిత ప్రకటించారు.
పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్లు, వ్యక్తిగత లబ్ధి పొందాలనుకునే వాళ్లు మేం ముగ్గురం కలిసి ఉండకూడదని ఇలా కుట్రలు చేశారని కవిత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. "మా కుటుంబం బాగుండొద్దు.. మేం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం వస్తుంది. నేను, నాన్న, అన్న కలిసి ఉండటం చాలా మందికి ఇష్టం లేదు. దీనిలో భాగంగా మొదటిగా నన్ను బయటకు పంపించారు. అదిక్కడితో ఆగదు. నాన్నా.. మీ చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి. రేపటి నాడు ఇదే ప్రమాదం రామన్న (కేటీఆర్)కు, మీకూ పొంచి ఉంది. భారత రాష్ట్ర సమితిని హస్తగతం చేసుకునే కుట్రలోనే నన్ను బయటకు పంపించారు" అని కవిత వ్యాఖ్యానించారు.

### అవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలా?

'అక్రమ కేసులు పెట్టి తిహాడ్ జైలులో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గతేడాది నవంబర్ 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత తెలిపారు. గురుకులాలు, బీసీ రిజర్వేషన్లు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందించాలని పోస్ట్ కార్డు ఉద్యమం చేశామన్నారు. తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చినపుడు గళమెత్తినట్లు చెప్పారు. బనకచర్ల, భద్రాచలం సమీపంలోని ముంపు గ్రామాల అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించినట్లు కవిత తెలిపారు. సీఎం సొంత జిల్లాలో భూనిర్వాసితులకు అండగా ఉన్నామని చెప్పారు. 47 నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను కలుపుకొని.. గులాబీ కండువాలతో అనేక ప్రజాసమస్యలపై మాట్లాడామన్నారు. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు ఎలా అవుతాయని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై భారత రాష్ట్ర సమితి పెద్దలు పునరాలోచన చేయాలన్నారు.

### హరీశ్‌రావు, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ అవుతుందా?

"కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీసీల అంశంపై మాట్లాడుతుంటే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నట్లు చిలువలు పలువలుగా ప్రచారం చేశారు. సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నానని చెప్పాను. దానిలో తప్పేముంది? నా తండ్రి కేసీఆర్ చిటికెన వేలు పట్టుకుని ఓనమాలు నేర్చుకున్నా. ఆయన స్ఫూర్తితోనే సామాజిక తెలంగాణ అని మాట్లాడా. స్వతంత్ర భారతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన గొప్ప నాయకుడు కేసీఆర్. చెప్పింది చెప్పినట్లు ఆయన చేశారు. ప్రతి కులాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. అది సామాజిక తెలంగాణ కాదా? నేనేమైనా తప్పు మాట్లాడానా? సామాజిక తెలంగాణ భారత రాష్ట్ర సమితికి అవసరం లేదా? భౌగోళిక తెలంగాణ వస్తే సరిపోతుందా?బంగారు తెలంగాణ అంటే హరీశ్‌రావు, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే అవుతుందా?సమాజంలో ప్రతి ఒక్కరూ బాగుంటేనే బంగారు తెలంగాణ అవుతుంది.

### రామన్నా.. బుజ్జగించి అడుగుతున్నా..

నేను రామన్న (కేటీఆర్)ను గడ్డం పట్టుకొని, బుజ్జగించి అడుగుతున్నా. ఒక చెల్లిని, మహిళా ఎమ్మెల్సీని.. నాపై కుట్రలు జరుగుతున్నాయని గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పా. మీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఏం జరిగిందో నాకు ఫోన్ చేయరా అన్నా? నేను కూర్చొని ప్రెస్‌మీట్ పెడితేనే న్యాయం జరగలేదంటే.. మామూలు మహిళా కార్యకర్తకు పార్టీలో అన్యాయం జరిగితే స్పందిస్తారా.. నాకైతే అనుమానమే. హరీశ్‌రావు, సంతోష్ గురించి ఆలోచించాలని కేసీఆర్‌కు బిడ్డగా చెబుతున్నా. తెలంగాణ ఉద్యమంలో మొదట్నుంచీ హరీశ్‌రావు లేరు. పార్టీ పెట్టిన 10 నెలల తర్వాత వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు ఎప్పుడో లొంగిపోయారు. ఆయన్ను గమనించుకో రామన్న (కేటీఆర్). సీఎం రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఒకే విమానంలో ప్రయాణించారా? లేదా? చెప్పాలి. సంతోష్, హరీశ్‌రావు గ్యాంగ్‌లు భారత రాష్ట్ర సమితికి పట్టిన జలగలు. వాళ్లిద్దరూ మా మంచి కోరుకునే వారు కాదు. హరీశ్, సంతోష్ అవినీతి వల్లే కేసీఆర్‌కు సీబీఐ మరక అంటింది.
గతంలో పార్టీకి ఒక్క క్షణం చెడ్డపేరు రాగానే హరీశ్‌రావు వెళ్లి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కలవలేదా? ఆయన ట్రబుల్ షూటర్ కాదు.. బబుల్ షూటర్. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపాతో మాట్లాడి రెండో అభ్యర్థిని పెట్టాలని హరీశ్ రావు ప్రతిపాదించారు. ఓ భాజపా ఎమ్మెల్యే నాకు ఫోన్ చేసి చెబితే కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లా. హరీశ్‌రావు ట్రబుల్ క్రియేట్ చేసి.. పరిష్కరించినట్లు నటిస్తారు. 2018 ఎన్నికల్లో 25 మంది ఎమ్మెల్యేలకు హరీశ్ రావు విడిగా డబ్బులు ఇచ్చారు. ఆ డబ్బు కాళేశ్వరం అవినీతిది కాదా? 2009లో కేటీఆర్‌ను ఓడించేందుకు నాడు డబ్బు పంపారు. 2007 నుంచి నేను రోడ్డుపైనే ఉన్నాను. కేసీఆర్ ఆరోగ్యాన్ని, పార్టీని కాపాడాలని కేటీఆర్‌ను కోరుతున్నాను. ఆరడుగుల బుల్లెట్ ఇవాళ నన్ను గాయపరిచింది.. రేపు ఎవరిని గాయపరుస్తుందో? హరీశ్‌రావు కారణంగానే ఈటల రాజేందర్, జగ్గారెడ్డి మొదలైన వారంతా పార్టీ నుంచి బయటకు వెళ్లారు. దుబ్బాక, హుజురాబాద్‌లో పార్టీ ఓటమికి ఆయనే కారణం. హరీశ్‌రావు నక్క జిత్తులను గమనించాలి. కేసీఆర్ వెంట నీడలా ఉండే సంతోష్‌కు ధనదాహం ఎక్కువ. హరితహారం మాటున గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పేరిట నకిలీ కార్యక్రమం చేపట్టారు. నిజామాబాద్‌లో నా ఓటమితో ప్రారంభించి.. కామారెడ్డిలో కేసీఆర్ ఓటమి వరకు కుట్ర చేశారు. మాజీ ఎమ్మెల్యేల్లో చాలా మంది సంతోష్ బాధితులు ఉన్నారు. భారత రాష్ట్ర సమితి సాఫ్ట్‌వేర్ అయితే.. తెలంగాణ జాగృతి హార్డ్‌వేర్. పార్టీకి నా కంట్రిబ్యూషన్ లేదా? కేవలం హరీశ్ రావు, సంతోష్‌ది మాత్రమే ఉందా?మేకవన్నె పులులను పార్టీలో ఉంచుకుంటే ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలి. కేసీఆర్ నిర్ణయాన్ని ప్రశ్నించలేను. మా కుటుంబంలో నలుగురికి ఫోన్ ట్యాపింగ్ నోటీసులు వచ్చాయి. కేటీఆర్‌కు సంబంధించిన వారి ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. హరీశ్‌రావు, సంతోష్, శ్రవణ్‌లే ఫోన్ ట్యాపింగ్ చేయించారు. నేను ఏ పార్టీలోనూ చేరేది లేదు. ఇప్పుడు బాధలో ఉన్నా. రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటా. ఆ తర్వాత అందరితో చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటా. నేను ప్రజల వద్దకే వెళ్తా"అని కవిత అన్నారు.

# మెట్ పల్లిలో ఈ నెల 6న గణేష్ నిమజ్జనం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**




జగిత్యాల జిల్లా మెట్ పల్లిలో ఈ నెల 6న గణేష్ నిమజ్జనం నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ, కలెక్టర్లు ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం మెట్ పల్లి ఆర్డీవో, డిఎస్పీ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ సంయుక్తంగా సమావేశమై, ఈ నెల 6వ తేదీన నిమజ్జనం జరుపుకోవాలని నిర్ణయించారు.

# విద్యుత్ షాక్‌తో రైతు మృతి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**



జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం యామపుర్ గ్రామంలో బుధవారం చెదలు భూమన్న(70) అనే వృద్ధ రైతు విద్యుత్ షాక్‌తో మృతిచెందారు. ఇంట్లోని విద్యుత్ వైరు కట్ అయి, ఇన్సులేషన్ తొలగిపోవడంతో వర్షం పడుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మరణించిన భూమన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు క్యాతం తిరుపతి కోరారు.

# మెట్ పల్లిలో వినాయక పూజలు



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని బాలకిషన్ నగర్ వినాయక సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పురోహితులు రమణ చారి వేద మంత్రాలతో వినాయక ప్రత్యేక పూజలు, హోమం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు తోట ప్రసాద్, తోట ప్రవీణ్, సాంబార్ శ్రీనివాస్, చందనగిరి రమేష్, డొల్లని నాగేశ్వర్, తాడూరి యాదగిరి, బోయిని ప్రవీణ్ కుమార్, పత్రి శంకర్, మహేష్ చొప్పరి, శ్రీనివాస్ కోరే, రమేష్, శ్రీకాంత్ తో పాటు మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రులు

## - గ్రామాల్లో ఘనంగా ఉత్సవాలు, అన్నదానం



**గాజెంగి మహేశ్వర్,కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గోదురు, తిమ్మాపూర్, యమాపూర్, వేములకుర్తి, బర్తిపూర్, ఎర్దండి, కోమటి కొండాపూర్, ఇబ్రహీంపట్నం, అమ్మకపేట్, ఎర్రపూర్ వంటి గ్రామాలలో దాదాపు 20 గణపతులను యువజన సంఘాలు, కుల సంఘాలు ఏర్పాటు చేశాయి. బుధవారం ఎనిమిదవ రోజున, అనేక గణేష్ మండపాల వద్ద అన్నప్రసాద వితరణ జరిగింది. స్వామివారికి ప్రత్యేక హారతులు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. గ్రామాలలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# గణపతి సన్నిధిలో చిన్నారుల నృత్యాలు



**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**

చిన్నక్రాంతి కాలనీ కమిటీ అందంగా అలంకరించిన మండపంలో కొలువుదీరిన గణనాథుడికి విశేష పూజలు జరుగుతున్నాయి. నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుండటంతో మండపం ఆధ్యాత్మిక శోభతో అలరారుతోంది. 7వ రోజు పి.ఆర్. డ్యాన్స్ అకాడమీ, సుధీర్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో డాన్స్ మాస్టర్ రమేష్ శిష్య బృందం చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా, చిన్నారి పొదిల హస్మిత శ్రీ చేసిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను విశేషంగా అలరించింది.

# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

## - అల్లర్లు చేస్తే కేసులు తప్పవు ఇబ్రాహీం పట్నం ఎస్ఐ

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**




జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం ఎస్ఐ అనిల్ వినాయక నిమజ్జనం ప్రశాంతంగా చేసుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో శోభాయాత్రలలో అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లే, నిమజ్జనం కూడా క్రమబద్ధంగా, ఎలాంటి అల్లర్లు లేకుండా చేసుకోవాలని వినాయక ఉత్సవ కమిటీలకు సూచించారు. డిజెలు, అధిక శబ్దంతో ఇబ్బంది కలిగించవద్దని, ఎదురెదురు శోభాయాత్రలతో గొడవలకు దిగేవారిపై కేసులు తప్పవని తెలిపారు.

# మార్కండేయ మందిరానికి విరాళం



**గాజెంగి మహేశ్వర్,కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో బుధవారం శ్రీ శివ భక్త మార్కండేయ మందిర నిర్మాణానికి దాసరి ప్రసాద్ తండ్రి గంగారం రూ. 25,116 విరాళంగా ఇచ్చి శాశ్వత సభ్యత్వం పొందారు. పద్మశాలి సంఘం అధ్యక్షులు ద్యావనపెల్లి రాజారాం మాట్లాడుతూ గంగారం కుటుంబానికి శివభక్త మార్కండేయ స్వామి, గణపతి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

# వేములకుర్తి గ్రామంలో ఎంపిడిఓ ఆకస్మిక తనిఖీ



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం వేములకుర్తి గ్రామంలో బుధవారం ఎంపిడిఓ మహమ్మద్ సలీం గ్రామ సందర్శన చేశారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన గోదావరి నది ఘాట్లను పరిశీలించి, నిమజ్జనం సజావుగా జరిగేందుకు హై మాస్ లైట్లను అమర్చాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్గత రోడ్లలో ప్లాంటేషన్ సైట్లను పరిశీలించి, ప్రతి ఇంటికీ పూల మొక్కలు నాటి సంరక్షించాలని అభివృద్ధి కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వినాయక పూజల్లో పాల్గొన్న - కోరుట్ల మాజీ ఎమ్మెల్యే




**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్ల లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినాయక స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పాల్గొన్నారు. ఆయన వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో కుప్పకూలిన

## - ఇంజినీరింగ్ కాలేజీ ఏవో నవీన్ రాంరెడ్డి

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



మేడ్చల్ జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. చీర్యాలలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీ ఏవో నవీన్ రాంరెడ్డి గుండెపోటుతో మరణించాడు. సోమవారం కళాశాల క్యాబిన్‌లోకి ప్రవేశించే సమయంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. సిబ్బంది వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనికి సంబంధించిన సీసీ ఫుటేజీ తాజాగా వెలుగులోకి వచ్చింది.

# మంచినీటి సమస్యను పరిష్కరించండిలిసిపిఎం పార్టీ నాయకులు రమేష్ గౌడ్



**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**

మునిపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సూపరిండెంట్ రామలింగంను కలిసి హైద్లాపూర్ గ్రామంలో మంచినీటి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగిందని సిపిఎం పార్టీ మండల నాయకులు రమేష్ గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదులపూర్ గ్రామంలో గత రెండు నెలలుగా బోర్లు చెడిపోవడంతో. గ్రామంలోని ప్రజలకు మంచినీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామస్తులు పలుమార్లు పంచాయతీ కార్యదర్శి కి అడిగిన పంచాయతీలో డబ్బులు లేవని నేను ఏమి చేయలేనని అంటున్నారని గ్రామస్తులు తెలిపారని అన్నారు. దీనితో బోర్లు బాగు చేయకపోవడంతో మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కనుక వెంటనే చెడిపోయిన బోర్లను బాగు చేసి గ్రామ ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. నాయకులు నాగేష్, అంజయ్య, లక్ష్మణ్, మైపాల్, తదితరులు పాల్గొన్నారు

# గజేంద్ర యూత్ గణనాథుని దర్శించుకున్న డిప్యూటీ తాసిల్దార్ ప్రదీప్



**కరపత్రం ప్రతినిది అందోలు**

మునిపల్లి మండల కేంద్రంలో. గజేంద్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని బుధవారం మునిపల్లి మండల డిప్యూటీ తాసిల్దార్ ప్రదీప్ దర్శించుకొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంటపం వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. గణనాథుడు ప్రజలందరినీ చల్లగా చూడాలని, ముఖ్యంగా యువకులు భక్తిశ్రద్ధలతో గణనాథుని ఏర్పాటు చేయడం అభినందనీయమని, యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా భక్తి మార్గంలో, మంచి మార్గంలో నడవాలని, యువకులు గొడవలకు దూరంగా ఉండాలని, మంచి చదువులు చదవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో. మునిపల్లి మాజీ ఉపసర్పంచ్ రమేష్ గౌడ్, నాయకులు పరమేశ్వర్, జగదీశ్వర్ ,ఎంపిటిసి యాదయ్య, యూత్ నాయకులు రాజు మల్లేశం, రాజేందర్ ,విజయ్, సాయి ,ప్రశాంత్, ఈశ్వరయ్య కాంతారావు, తదితరులు పాల్గొన్నారు

# యూరియా ఎందుకు దొరకడం లేదో చెప్పండి

- చంద్రబాబు ఉంటే కరువు లేదంటే..అదంటే అతివృష్టి
- సుగాలి ప్రీతి కుటుంబానికి ఎందుకు న్యాయం చేయలేదు
- కూటమి ప్రభుత్వంపై బొత్స విసుర్లు

**కరపత్రం ప్రతినిధి కాకినాడ,సెప్టెంబర్3 :**

ఊగిపోయి మాట్లాడావు కదా.. ఇప్పుడు ఏమైంది నీ పౌరుషం పవన్ అని శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యానారాయణ ప్రశ్నించారు. కాకినాడలో బొత్స మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకునేవారే లేకుండాపోయారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఒక బస్తా యూరియా కోసం రైతులు నానా అగచాట్లు- పడుతున్నారు. వ్యవసాయం దండగ,లాభంలేదని చంద్రబాబు బుర్రలో ఉంది. చంద్రబాబు అధికారంలో ఉంటే అతివృష్టి లేకపోతే అనావృష్టి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో యూరియా ఎందుకు దొరుకుంతుంది? కూటమి అధికారంలో ఉన్న ఏపీలో యూరియా ఎందుకు దొరకడం లేదు. 9వ తేదీన రైతు సంఘాలతో కలిసి ఉద్యమిస్తాం. ఆర్డీవో ఆఫీసుల్లో వినతి పత్రాలు ఇస్తాం అని బొత్స అన్నారు. 32మంది బలిదానాలతో విశాఖ ఉక్కు పరిశ్రమ వచ్చింది. విశాఖ ఉక్కుపై ప్రజల్ని చైతన్య పరుస్తాం. విశాఖ ఉక్కుకోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. విశాఖ ఉక్కు గురించి సీఎం,డిప్యూటీ- సీఎం ఎందుకు మాట్లాడరు. పవన్ కల్యాణ్ ఉగిపోయి మాట్లాడావు కదా.. ఏమైందీ మీ పౌరుషం. ఎన్నికలకు పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన వాళ్లు ఇప్పుడు ఏమయ్యారు. విశాఖ ఉక్కుపై ప్రభుత్వ భవిష్యత్తు కార్యచరణ ఏంటీ-? పవన్.. మీరు ఉప్పు కారం తినడం లేదా?. ప్రధాని మోదీతో విశాఖ ఉక్కు గురించి చంద్రబాబు ఏం మాట్లాడారు. 15నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.2లక్షల కోట్లు- అప్పు చేసిందని వ్యాఖ్యానించారు. 15 నెలలు గడిచిన సుగాలి ప్రీతి కుటుంబానికి ఎందుకు న్యాయం చేయలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం తెలిసి మాట్లాడుతున్నారా? తెలియక మాట్లాడుతున్నారా? అంటూ బొత్స మండిపడ్డారు. దమ్ములు గురించి మాట్లాడటానికి ఇవి మల్ల యుద్ధాలు కాదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష హోదా ఇవ్వండి..అసెంబ్లీ లో తేల్చుకుంటామని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 నెలల్లో రెండు లక్షలు కోట్లు- అప్పులు తెచ్చారని.. ఈ విషయం వాస్తవం కాకపోతే.. వెంటనే బయట పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతిలో తీసుకుని అక్రమంగా అరెస్ట్ లు చేస్తున్నారని ఆరోపించారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.

- బి ఒక్కపూట పని విధానం అమలు చెయ్యాలి.
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.S మల్లేశం.





**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
మున్సిపల్ కార్మికులు ఎదురుకుంటున్నా సమస్యలు పరిష్కారం చేయాలనీ సీఐటీయూ ఆధ్వర్యంలో నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం మాట్లాడుతూ ESI లో నామిని పేర్లు చేర్చకపోవడంతో ఎవరికైనా ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వెంటనే నామిని పేర్లు చేర్చాలని కోరారు. పని చేయాలనీ అధికారులు చెప్తున్నా పనిముట్లు గడపార, కత్తి, కొడవలి, గోడలి ఇవ్వడం లేదని పని ఎలా చేస్తారని ప్రశ్నించారు. కార్మికులు అత్యవసర సమయంలో ఎప్పుడు పిలిసిన అప్పుడు వచ్చి వార్డులలో పని చేస్తున్నారని వారికీ వారంతరపు సెలవులు ఇవ్వాలని కోరారు. రెండు పుట్టాలా పని చేయడం అంటే కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మెదక్ లో ఒక్కపూట నిర్వహిస్తున్నట్లుగా నర్సాపూర్ లో కూడా ఒకే పూట పని చేయించాలని డిమాండ్ చేశారు. అందరూ కార్మికుల లాగానే వాటర్ సప్లై, ఎలక్ట్రిషన్ కార్మికులకు సమానంగా వేతనాలు ఇవ్వాలని అన్నారు. సంవత్సరం లో ఇవ్వాల్సిన సబ్బులు, బెల్లం, నూనె ఒకే సారి ఇవ్వకుండా 3 నెలలకు ఒకసారి ఇవ్వడం తో కార్మికులు వాడుకోవడానికి సులువుగా ఉంటుందని గుర్తుచేశారు. డ్రైవర్స్ కు కార్యాలయం నుండే లైసెన్స్ ఇప్పించాలని కమిషనర్ కీ వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు, మున్సిపల్ కార్మికులు పుష్ప, రాములు, శంకరయ్య, అనిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న కొరిమి సంతోష్ .

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 3**
శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన కొరిమి సంతోష్ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడి టోరియంలో కలెక్టర్ పమేల సత్పతి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ పురస్కారం అవార్డు అందుకున్నారు. 2003లో వ్యాయామ విద్య ఉపాధ్యాయునిగా ట్రైనింగ్ పూర్తి చేసి 22 సంవత్సరాలుగా ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేస్తూ ఎంతో మంది రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేశారు. ప్రస్తుతం కరీంనగర్ లోని వసంత్ వ్యాలీ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా ఉద్యోగం చేస్తూ అత్యుత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారు. ఈ అవార్డు రావడం పట్ల వసంత్ వ్యాలీ పాఠశాల చైర్మన్ ఏ.బుచ్చిరెడ్డి, కరస్పాండెంట్ ఏ.స్వరూప ,బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయ బృందం, క్రీడా సంఘాల బాధ్యులు,ఒలంపిక్ సంఘాల బాధ్యులు, ప్రభుత్వ ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.



# జిఎం కార్యాలయంలోని గణనాథునికి 108 రకాల నైవేద్యాలు సమర్పణ



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథునికి అధికారులు, క్లరికల్ సిబ్బంది అందరు కలిసి కట్టుగా స్వామి వారికి 108 రకాల నైవేద్యాలను భక్తి శ్రద్దలతో తీసుకువచ్చి ఆ గణనాథునికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్జీ.1 ఏరియా జిఎం శ్రీ డి.లలిత్ కుమార్, ఆర్జీ.1 సేవా అధ్యక్షురాలు డి.అనిత లలిత్ కుమార్ దంపతులు వినాయకుడికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి స్వామివారికి కొబ్బరికాయ, హారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. విఘ్నేశ్వరుడి కృప కటక్షాలు అందరిమీదా ఉండాలని స్వామి వారిని పూజించారు. అందరు ఐఖ్యమత్యం చాటేలా అందరు కలిసికట్టుగా 108 రకాల ప్రసాదాలను ఎంతో భక్తిశ్రద్ధలతో ఇంటి వద్ద నుండి చేసుకొని రావటం వాటిని ఎంతో భక్తి శ్రద్దలతో వినాయకునికి సమర్పించటం ఒక గొప్ప అదృష్టమని తెలిపారు. ఇలాగె మునుముందు కుడా అందరు కలిసి కట్టుగా ఇదే స్ఫూర్తితో ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరిపై గణనాథుని కృప కటాక్షాలు ఉండాలని స్వామి వారిని పూజించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ అధికారిని దనలక్ష్మీబాయి, పర్చేస్ అధికారి భీమా, ఇతర అధికారులు శ్రావణ్ కుమార్, హనుమంతరావు, సాంబ శివరావు, వూట్ల దేవా చారి, ఇందురి సత్యనారాయణ, మురళీధర్, సంతోష్, ఓదెలు, జిఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజన్న సేవలో ఇస్కాన్ ఆలయ అధ్యక్షుడు సత్య గోపీనాథ్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
దక్షిణ భారతదేశ ఇస్కాన్ ఆలయాల అధ్యక్షుడు, రాజమండ్రి ఇస్కాన్ ఆలయ గురువు సత్య గోపీనాథ్ దాస్ బుధవారం రాజన్నకు కోడె మొక్కు చెల్లించి, దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో వేదపండితులు అర్చకులు ఆశీర్వచనం అందించగా, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ స్వామివారి శేషవస్త్రం కప్పి, లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీకాంతా చార్యులు, సీనియర్ అసిస్టెంట్ బోడుసు మహేష్ ఉన్నారు.

# తేజస్ అకాడమీ 21 మంది విద్యార్థులకు ఇండియన్ నేవీ ఉద్యోగాలు.




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 3**
తేజస్ అకాడమీ నుండి 21 మంది విద్యార్థులకు ఇండియన్ నేవీ లో సీనియర్ సెకండరీ రిక్రుట్స్ అగ్ని వీర్ ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగిందనీ తేజస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్ రావు తెలిపారు.నేవీ 2025 నియామకాలలో పాల్గొని జాతీయ స్థాయి లో మెరిట్ సాధించి అగ్ని వీరులుగా ఉద్యోగాలకు ఎంపికకావడం జరిగిందనీ,

ఒరిస్సా లోని చిల్కా ట్రైనింగ్ సెంటర్ లో 11/09/2025 న రిపోర్ట్ చేయాల్సి ఉందనీ , నేవీ లో జాయిన్ అయి ఉన్నతమైన స్థానం లో ఉండి వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కొరుకుంటున్నామనీ తెలిపారు.తేజస్ అకాడమీ లో రాష్ట్ర స్థాయి మార్కులు ఇంటర్మీడియట్ లో ఎంపీసీ ఫస్ట్ ఇయర్లో 470 కి 468 , ఎంపీసీ సెకండ్ ఇయర్ లో 1000 కి 993 మార్కులు, సీఈసీ 500 కు 490, సీఈసీ సెకండియర్ లో 1000 కీ 973 మార్కులు, ఫస్ట్ ఇయర్ బైపిసి లో 440 కు 436, బైపిసి సెకండియర్ లో 1000 కి 969 వంటి రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులు సాధిస్తూ , ప్రతి నోటిఫికేషన్ లో ,తెలంగాణ లోనే అత్యధిక ఉద్యోగాలు సాధిస్తూ 2000 కు పైగా విద్యార్థులను ఉద్యోగస్తులుగా తీర్చి దిద్దడం జరిగిందనీ తేజస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్ రావు తెలిపారు

# యస్.జి.ఎఫ్ వాలీబాల్ ఛాంపియన్షిప్ పోటీలలో పారమిత విద్యార్థుల హవా .



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
ఈ నెల 1, 2 వ తేదీ లలో కరీంనగర్ అర్బన్ పాఠశాల క్రీడా సమాఖ్య ఆద్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల సప్తగిరి కాలనీ లో జరిగిన 69 వ కరీంనగర్ అర్బన్ మండల అండర్-14, అండర్-17 బాలుర వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో 50 పాఠశాలలు పాల్గొనగా స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించిఛాంపియన్షిప్ ను కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు.ఈ ఛాంపియన్షిప్ సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డా ఇ. ప్రసాదరావు , డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, టి.యస్.వి.రమణ, కె.హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయ కర్తలు రబీంద్రపాత్రో, నాగరాజు, రాము, భవానీ ,వ్యాయామ ఉపాధ్యాయులు యస్. రాజు, కె.గౌతమ్ , జె శ్రీనివాస్ లు ప్రత్యేకంగా అభినందించారు.

# అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జర్నలిస్టులకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య పరామర్శ

**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**





అనారోగ్యంతో హైదరాబాద్ లో చికిత్స పొందుతున్న ఇద్దరు సీనియర్ జర్నలిస్టులను పలువురు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజే ఎఫ్) రాష్ట్ర నాయకులు పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడబ్ల్యూజేఎఫ్ మహబూబా బాద్ జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర రావును ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు, ఐఎఫ్ డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వర రావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఇటీవల రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీనియర్ జర్నలిస్టు, టీడబ్ల్యూజే ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ యర్రమిల్లి రామారావు ను వారు పరామర్శించారు. రామారావు ఎడమకాలు తుంటి విరగడంతో శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం ఈసీఐఎల్ లోని ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటు న్నారు. ఈ విషయం తెలుసుకున్న ఫెడరేషన్ నాయకులు మామిడి సోమయ్య, ఆనందం తో పాటు రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జెమిని నాగరాజు, మేడ్చల్ జిల్లా కోశాధికారి బెలిదె అశోక్, నాయకులు గడ్డమీది అశోక్, కొండా సంజీవ్ కుమార్ తదితరులు రామారావు ఇంటికి వెళ్లి పరామర్శించారు.

# వినాయక నిమజ్జన శోభాయాత్రలో డిజేలకు అనుమతి లేదు

- నిబంధనలకు విరుద్ధంగా డిజేలు ఉపయోగిస్తే చర్యలు తప్పవు
- శాంతియుత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేయాలి
- నిమజ్జనానికి 200 మంది పోలీసులతో బందోబస్తు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలో జరిగే వినాయక నిమజ్జన శోభాయాత్రలో డీజేలకు పర్మిషన్ లేదని, నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నిమజ్జన వేడుకలను శాంతియుత వాతావరణంలో పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని పలు గణేష్ మండపాలను టౌన్ సిఐ తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేములవాడలో నేడు జరిగే నిమజ్జనానికి 200 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీస్ వారి సలహాలు సూచనలు తప్పక పాటిస్తూ ఏలాంటి గొడవలు అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా శాంతియుత వాతావరణంలో శోభయాత్ర సాగేలా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఆయన వెంట టౌన్ సిఐ వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# నమో మిషన్ వందే గోమాతరం గౌరవాధ్యక్షుడి నియామకం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
నమో మిషన్ వందే గోమాతరం గౌరవాధ్యక్షుడిగా వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ తొగరి కరుణాకర్ ను నియమిస్తూ ఫౌండేషన్ నిర్వాహకులు వీరమద్వి ఆచారి బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తొగరి కరుణాకర్ మాట్లాడుతూ గోమాత రక్షణే ధ్యేయంగా, ప్రతి భారతీయుడు పనిచేయాలని, గోమాతల రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని, నాపై పూర్తి నమ్మకంతో నన్ను గౌరవాధ్యక్షుడిగా నియమించిన ఫౌండేషన్ నిర్వాహకులు వీర మద్వి ఆచారికి, జిల్లా బాధ్యులు సలీమ్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.